క్లుప్తంగా

తిరుమలకు పాదయాత్ర



ప్రత్తిపాడు నుంచి తిరుమలకు పాదయాత్ర చేస్తున్న రెడ్నం రాంబాబు దంపతులు

ప్రత్తిపాడు: గ్రామానికి చెందిన రెడ్నం రాంబాబు, శ్రీవల్లీ దంపతులు తిరుమల వేంకటేశ్వరస్వామి సన్నిధికి పాదయాత్ర చేస్తున్నారు. స్థానిక శ్రీరామనామ క్షేత్రం ఆంధ్రా భద్రాద్రిలో శనివారం ఉదయం ప్రత్యేక పూజలు చేసి పాదయాత్రను ప్రారంభించారు. దేశం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ తిరుపతి తిరుమల దేవస్థానానికి పాదయాత్ర చేస్తున్నట్లు రెడ్నం రాంబాబు తెలిపారు. పాదయాత్ర చేస్తున్న దంపతులకు మార్గం మధ్యలో విశ్వ హిందూ పరిషత్, భారత్ వికాస్, బీజేపీ సభ్యులు సహకరించాలని విశ్వ హిందూ పరిషత్ కాకినాడ నగర అధ్యక్షుడు రెడ్నం రాజా, రావూరి తాతాజీ కోరారు.

సీహెచ్‌సీ భవనం పరిశీలన



జెడ్.రాగంపేటలో సీహెచ్‌సీ నూతన భవనాన్ని పరిశీలిస్తున్న డీసీహెచ్‌ఎస్ స్వప్న

గండేపల్లి: మండలంలోని జెడ్.రాగంపేటలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) భవనాన్ని శనివారం కాకినాడ డీసీహెచ్‌ఎస్ ఎస్.స్వప్న పరిశీలించారు. జగ్గంపేట సీహెచ్‌సీ వైద్యులు టి.ప్రణీత్‌తో కలిసి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు విద్యుత్ సరఫరా తప్ప మిగిలిన పనులు పూర్తయ్యాయని తెలిపారు. విద్యుత్ సరఫరా కూడా ఏర్పాటు చేసి అతి త్వరలోనే భవనాన్ని ప్రారంభిస్తామన్నారు. రోగుల సంఖ్య పెరగడంతో జగ్గంపేటలో సీహెచ్‌సీ భవనాన్ని గతంలో 35 పడకల ఆస్పత్రిగా మార్చారని, హాస్పటల్‌లో గదులు సరిపోకపోవడంతో జగ్గంపేట సీహెచ్‌సీని నూతన భవనంలోకి మారుస్తున్నట్టు పేర్కొన్నారు. ఆమె వెంట జగ్గంపేట సీహెచ్‌సీ వైద్యులు టి.ప్రణీత్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోలీసు రాజ్యలక్ష్మికి ఉత్తమ బీఎల్‌ఓ అవార్డు



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి మెమెంటో అందుకుంటున్న రాజ్యలక్ష్మి

జగ్గంపేట: మండలంలోని మన్యవారిపాలెం గ్రామానికి చెందిన మహిళా పోలీసు డి.రాజ్యలక్ష్మి ఉత్తమ బీఎల్‌ఓ అవార్డును అందుకున్నారు. విజయవాడలో శనివారం నిర్వహించిన ఓటర్స్ డే కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ చేతులమీదుగా ఆమె సర్టిఫికేట్, షీల్డ్, రూ.5 వేలు నగదు బహుమతిని అందుకున్నారు. అవార్డు పొందిన రాజ్యలక్ష్మిని జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, పోలీసు సిబ్బంది అభినందించారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



తంటికొండలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. పవిత్ర ఏకాదశిని పురస్కరించుకుని తెల్లవారు జాము నుంచి ఆలయంలో సుప్రభాత సేవ, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం పల్లకీసేవ నిర్వహించి స్వామివారికి పంచహారతులు సమర్పించారు. సుమారు రెండు వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

కృష్ణాలయంలో ప్రత్యేక పూజలు

కిర్లంపూడి: కిర్లంపూడిలో వేంచేసిన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కిర్లంపూడి గ్రామానికి చెందిన సంపర సుందర రామ్‌కుమార్, అన్నపూర్ణ దంపతులు కేరళలోని గురువాయూరు కృష్ణామందిర్ నుంచి తీసుకొచ్చిన దీపం కుందెను స్వామివారికి సమర్పించారు. ఆలయ అర్చకులు గోవర్ధనం శ్రీధరాచర్యులు, గోపాలాచర్యులు, కురుమళ్ల విష్ణు పాల్గొన్నారు.

కూటమి కుట్రలు

- ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించేందుకు పన్నాగం
- లేనిపోని అభియోగాలు మోపేందుకు సన్నద్ధం
- సామాజిక తనిఖీ ప్రజావేదికను పావుగా వాడుకునే యోచన
- రెచ్చిపోతున్న టీడీపీ, జనసేన కార్యకర్తలు
- మండలంలో 13 మంది ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు ?



పాతకొట్టాంలోని సంగవాక సీతమ్మ చెరువులో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

కోటనందూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడమే తడవుగా ఆ పార్టీల నేతలు కుట్రలు, కుతంత్రాలకు తెర లేపారు. వైఎస్సార్ సీపీకి అనుకూలమైన వారంటూ కొన్ని శాఖలలోని ఉద్యోగులను తొలగించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అనేక సంవత్సరాలుగా పని చేస్తున్న వారిని సైతం తొలగించి తమ అనుచర గణాన్ని నియమించేందుకు తహతహలాడుతున్నారు. దీనిలో భాగంగానే తమకు నచ్చని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించే కార్యక్రమం చేపట్టారు.

అధికారంలోకి వచ్చినప్పటి నుంచి...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దొడ్డిదారిన పాత ఫీల్డ్ అసిస్టెంట్లను పక్కన పెట్టి తమ అనుచర గణంతో పనులు చేయిస్తున్నారు. పంతం నెగ్గించుకున్నప్పటికీ అధికారికంగా వారిని తొలగించడం వీలుకాక రికార్డెడ్‌గా ఇప్పటి వరకూ కొనసాగించుకుంటూ వచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న 2023-24 సామాజిక తనిఖీని ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపునకు వేదికగా ఎంచుకున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లపై లేనిపోని అభియోగాలు మోపి తొలగించేలా కూటమి నేతలు ఉపాధి అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఉపాధి పనుల తనిఖీ సమయం, గ్రామ సభల్లో ఫీల్డ్ అసిస్టెంట్లపై ఆరోపణలు చేయాలని ఉపాధి కూలీలపై అధికారాన్ని వాడుతున్నారు. ఈ వ్యవహారంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ, జనసేనలో చేరిన కార్యకర్తలు కీలకపాత్ర పోషిస్తున్నారు. వారంత ఫీల్డ్ అసిస్టెంట్లపై కుట్రలు, కుతంత్రాలను మూటకట్టే పనిలో నిమగ్నమై ఉన్నట్లు తెలుస్తోంది.

మండలంలో 10 వేల జాబ్ కార్డులు

కోటనందూరు మండలంలోని 17 పంచాయతీల పరిధిలో 10 వేలు జాబ్‌కార్డులుండగా ఆరు నుంచి ఏడు వేల మంది కూలీలు ప్రతిరోజూ ఉపాధి హామీ పనులు చేస్తారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సామాజిక తనిఖీ 2024-25 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న తరుణంలో ఇప్పుడు నిర్వహిస్తున్నారు. రెండేళ్ల క్రితం జరిగిన పనుల వాస్తవరూపం ఇప్పుడు కనిపిస్తుందా ? అప్పుడు జరిగిన పనులకు, రికార్డుల్లో నమోదైన వివరాలకు సంబంధం ఉంటుందా ? అప్పుడు జరిగిన వాస్తవాలను కూలీలు ఇప్పుడు చెప్పగలరా ? అనేదే పెద్ద ప్రశ్న. వీటి ఆధారంగానే ఫీల్డ్ అసిస్టెంట్లపై అభియోగాలు మోపి వారిని తొలగించేందుకు కూటమి నేతలు ప్రయత్నాలు చేస్తున్నారనేది జగమెరిగిన సత్యం.

నలుగురికి మినహాయింపు

మండలంలో 17 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉండగా కూటమి నేతలను ప్రసన్నం చేసుకున్న నలుగురిని మినహాయించి మిగిలిన 13 మందిని తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కూటమి నేతలు ఉపాధి సిబ్బందిపై తీవ్రమైన ఒత్తిడి తేవడంతో అధికారులు రాజీనామా చేయాలని, లేనిపక్షంలో అభియోగాలు మోపి రికవరీలు, కేసులు బనాయిస్తామని ఫీల్డ్ అసిస్టెంట్లపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. ఈ బాధ భరించలేని ఐదుగురు ఫీల్డ్ అసిస్టెంట్లు ఇప్పటికే రాజీనామా పత్రాలు అందజేసినట్లు తెలుస్తోంది. మిగిలిన ఫీల్డ్ అసిస్టెంట్లపై సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆరోపణలు చేసి తొలగించేందుకు కూటమి నేతలు, ఉపాధి అధికారులు వల పన్నుతున్నారు.

టీడీపీ నేతల ఒత్తిడితోనే...



గ్రామంలో జరిగిన ఉపాధి పనులపై కూలీలు, ప్రజల నుంచి ఎటువంటి ఆరోపణలు లేవు. టీడీపీ నేతల ఒత్తిళ్లతోనే రాజీనామా చేయాలని మా అధికారులు నాపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. రాజీనామాకు నేను అంగీకరించలేదు. మా ఊరిలో జరిగిన గ్రామ సభలో కూలీలు, ప్రజల నుంచి ఆరోపణలు లేకపోవడంతో సంగవాక సీతమ్మ చెరువులో పని చేయకుండా చేసినట్లు చూపించానని అదే గ్రామానికి చెందిన టీడీపీ నేతలు ఆరోపణలు చేస్తూ అధికారులపై ఒత్తిడి చేశారు. గత 15 ఏళ్లుగా ఫీల్డ్ అసిస్టెంటుగా పని చేస్తున్న తనను తొలగించాలనుకోవడం అన్యాయం.

– బర్రే ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్, పాతకొట్టాం

పనితీరు మెరుగుపరుచుకోవాలి



విద్యాశాఖ అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ శ్రీరమణి

గండేపల్లి: విద్యాశాఖలో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది పనితీరు మెరుగు పరుచుకోవాలని పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం విద్యాశాఖాధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతం, మధ్యాహ్న భోజన పథకం అమలు, పనితీరు, తదితర అంశాలపై ఆరా తీశారు. పరీక్షల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యాశాఖను సమీక్షిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నాతి బుజ్జి, తహశీల్దార్ ఆర్ శ్రీనివాస్, ఎంఈఓలు కెహెచ్ నాయక్, కె వెంకటరెడ్డి, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

ప్రత్తిపాడు: మండలంలోని పెద్దిపాలెం గ్రామ శివారుల్లో సారా స్థావరాలపై ప్రత్తిపాడు ఎక్సైజ్ సిబ్బంది శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివ ప్రసాద్ తెలిపారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్యతతో పార్టీ విజయానికి కృషి చేయాలి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు
- మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నేత ముద్రగడ పద్మనాభంతో కలిసి ఏలేశ్వరంలో పర్యటన



ఏలేశ్వరంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి ముద్రగడ, కో ఆర్డినేటర్ గిరిబాబు

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ శ్రేణులు కలిసికట్టుగా పార్టీ విజయానికి కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు సూచించారు. పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా నియమితులైన తరువాత తొలిసారిగా తన తండ్రి, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంతో కలిసి శనివారం ఏలేశ్వరంలో పర్యటించారు. పట్టణంలోని పార్టీ శ్రేణులు వారికి ఘన స్వాగతం పలికారు. అభిమానులు నీరాజనం పట్టారు. పట్టణ శివారు నుంచి ఊరేగింపుగా పాత బస్టాండ్ వినాయకుడి గుడి వద్దకు చేరుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి పార్టీ పట్టణ అధ్యక్షుడు శిగడం వెంకటేశ్వరరావు ఇంటికి వెళ్లి పార్టీ నాయకులు, కార్యకర్తలను కలిశారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం తన కుమారుడు గిరిబాబును అందరికీ పరిచయం చేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ అధికారం చేపట్టేలా పార్టీ శ్రేణులు కష్టపడి పని చేయాలన్నారు. పార్టీ నాయకులు శిగడం వెంకటేశ్వరరావు, బదిరెడ్డి గోవింద్, సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

నగర పంచాయతీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి భర్త కౌన్సిలర్ అలమండ చలమయ్య ఇటీవల ఆపరేషన్ చేయించుకున్నారు. ఆయనను ముద్రగడ పద్మనాభం, ముద్రగడ గిరిబాబు పరామర్శించారు. ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కౌన్సిలర్ కోరాడ రామలక్ష్మీదేవి తండ్రి ఇటీవల మృతి చెందడంతో ఆమెను, పార్టీ నేత కోరాడ ప్రసాద్‌ను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ప్రముఖ వైద్యుడు గోపి శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.



ఏలేశ్వరంలో పార్టీ శ్రేణులతో ముద్రగడ గిరిబాబు, ముద్రగడ పద్మనాభం

ఉపాధి హామీ పనులపై ఫిర్యాదు



ఎంపీడీఓ శివరామకృష్ణయ్యకు ఫిర్యాదు చేస్తున్న ఎస్.అగ్రహారం మహిళలు

రౌతులపూడి: పేదలమైన తమకు ఉపాధి హామీ పనులు కల్పించడం లేదని మండలంలోని ఎస్.అగ్రహారం గ్రామానికి చెందిన పలువురు దళితులు ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఎంపీడీఓ శివరామకృష్ణయ్యకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనుల్లో రెండు నెలలుగా తమకు అవకాశం లేకుండా అధికారులు ఇబ్బంది పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పనులు లేక కుటుంబ పోషణకు అవస్థలు పడుతున్నామని వివరించారు. అర్హులైన తమకు కూలి పనులు చెప్పకుండా గ్రామంలో పనులకు వెళ్లని కొంతమందికి దొంగ మస్తర్లు వేసి అధికారులు నిధులు కాజేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే దీనిపై విచారణ చేసి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కూలీలు సీహెచ్ కుమారి, చిందాడ రమణ, తిరుమలరెడ్డి అచ్చియ్య, బండి సత్యవతి, బోడపాటి వీరాస్వామి, చిందాడ పెద్దిరాజు, చిందాడ మంగ, చిందాడ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యువత అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉమ్మిడి వెంకట్రావు

ప్రత్తిపాడు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగు జాడల్లో యువత నడవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు పిలుపునిచ్చారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు నైపుణ్య మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం సాయంత్రం సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్‌పై బీజేపీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలను తిప్పికొట్టేందుకే గణతంత్ర దినోత్సవానికి ఒక్క రోజు ముందే సంవిధాన్ గౌరవ అభియాన్ నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల కమిటీ అధ్యక్షుడు ఊటా వీరబాబు, నైపుణ్య డిగ్రీ కళాశాల చైర్మన్ గట్రెడ్డి సత్తిబాబు, ప్రిన్సిపాల్ ఈగల రాంబాబు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శింగిలిదేవి సత్తిరాజు, గున్నాబత్తుల రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసా థియేటర్ సెంటర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు



తుని శ్రీనివాసా థియేటర్ సెంటర్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

తుని: స్థానిక శ్రీనివాసా థియేటర్ సెంటర్లో వ్యాపారుల ఆర్థిక సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు పట్టణ సీఐ గీతా రామకృష్ణ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా సీఐ గీతా రామకృష్ణ మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి సెంటర్లోనూ సీసీ కెమెరాల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను గుర్తించామన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సీసీ కెమెరాల నిరంతర నిఘా వల్ల చైన్ స్నాచింగ్, బైక్ దొంగతనాలు, నేరాలను నివారించవచ్చని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకారం అందించిన శ్రీనివాసా థియేటర్ సెంటర్లో వ్యాపారులను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు అభినందించారు.

269 మందికి ఉచిత వైద్య పరీక్షలు



కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కిర్లంపూడి: కృష్ణవరం టోల్ ప్లాజా వద్ద శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన టీఎల్ ఎంఎస్‌వీ పీడీ ఎ.శ్రీనివాస్ ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రాలయ వైద్యులు 103 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. రాజమహేంద్రవరానికి చెందిన శ్రీకిరణ్ హాస్పటల్ ఆధ్వర్యంలో 113 మందికి జనరల్ చెకప్, 53 మందికి ఈసీజీ పరీక్షలు చేశారు. ప్రాజెక్ట్ మేనేజర్ నాగేశ్వరరావు, టోల్‌ప్లాజా మేనేజర్స్ జీవీ రమణ, వి.సురేష్ కుమార్, రాజశేఖర్, ఆశీసు, అశోక్, టోల్‌ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం

గోకవరం: మండలంలోని గంగంపాలెం రైతు సేవా కేంద్రంలో శనివారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి డాక్టర్ కృష్ణవేణి సుమారు 40 మంది రైతులకు చెందిన 52 పశువులకు, 98 గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్‌లు వేశారు. అనంతరం సర్పంచ్ దొడ్డి వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సీతా దుర్గబాబు, స్థానిక నాయకుడు సాలపు నలమహారాజు చేతుల మీదుగా పాడి రైతులకు మందులు, పశువుల పోషకాహార కిట్లు అందజేశారు. సిబ్బంది ఎం.నివేదిత, ఎం.శ్రీను, జి.వీరబాబు, ఎం.శ్రీనివాస్, జి.సురేష్ పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ ప్రకాష్, డైరక్టర్ సురేష్

గోకవరం: తమిళనాడులో ఇటీవల జరిగిన ఓపెన్ స్టేట్ బ్యాడ్మింటన్ పోటీల్లో గోకవరం జ్ఞానసరస్వతి విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలలో శనివారం చైర్మన్ ప్రకాష్, డైరెక్టర్ సురేష్ ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల చెన్నైలో ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల మధ్య జరిగిన ఓపెన్ బ్యాడ్మింటన్ పోటీల్లో 9వ తరగతి చదువుతున్న లోకేష్ డబల్స్ విభాగంలో మొదటి స్థానంలో, సింగిల్స్ విభాగంలో రెండవ స్థానంలో, ఆదో తరగతి చదువుతున్న అఖిల్ మూడో స్థానంలో నిలిచారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులు, వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీ సంతోష్‌లను అభినందించారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం
- సీనియర్ ఓటర్లకు సత్కారాలు



ఎస్.అన్నవరంలో సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

తుని రూరల్: మండల పరిధిలోని గ్రామాల్లో శనివారం వీఆర్వోలు, బీఎల్‌ఓల ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో సీనియర్ ఓటర్ల సత్కారాలు, ఓటు హక్కు పొందడం, వినియోగించుకోవడంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఎస్.అన్నవరంలో జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోడిశెట్టి సత్యనాగేశ్వరరావు పాల్గొని సీనియర్ ఓటర్లను పూలమాలలతో సత్కరించారు. నాయకులు కుసనం దొరబాబు, పోలిశెట్టి రామలింగేశ్వరరావు, బోడిశెట్టి గణేష్, హెచ్ఎం వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి వీరలక్ష్మి, ఉపాధ్యాయులు, ఓటర్లు పాల్గొన్నారు.

జగ్గంపేట: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం జగ్గంపేటలో తహసీల్దార్ జీవీఆర్ రమేష్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రమేష్ మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం ఓట్లు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

ఏలేశ్వరం: ప్రతిఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.సత్యనారాయణ సూచించారు. పట్టణంలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కమిషనర్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సుబ్బారెడ్డి, బీఎల్‌ఓలు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డి.సునీత ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం మేనేజర్ ప్రగడ ప్రయాగమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గండేపల్లి: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద సీనియర్ ఓటర్లను సన్మానించి, కొత్త ఓటరు కార్డులు అందజేశారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

కిర్లంపూడి: ఓటుహక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జె.చిరంజీవి సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని కిర్లంపూడిలో శనివారం ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓటుహక్కు ప్రాముఖ్యతను గ్రామస్తులకు వివరించారు. రీసర్వే డీటీ ఆర్.శ్రావణి, ఆర్ఐ సత్యదేవి, వీఆర్వోలు సూర్యప్రకాష్, నూకబాబు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శంఖవరం: ఓటుహక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని తహసీల్దార్ అల్లాడి తాతారావు సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం పలు గ్రామాల్లో సీనియర్ ఓటర్లను శాలువా, పూలమాలతో సన్మానించారు. కత్తిపూడి సీతారామా కళాశాల విద్యార్థులు ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

తొండంగి: అర్హులైన ప్రతిఒక్కరూ ఓటుహక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ వి.మురార్జీ సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. డిప్యూటీ తహసీల్దార్ వీరేష్, ఆర్.ఐ రాజారావు, ప్రిన్సిపాల్ ఎంవీకే మెహర్ పాల్గొన్నారు. పెరుమాళ్లపురం జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.



పాండవులపాలెంలో ఇండియా మ్యాప్ ఆకారంలో ఏర్పడిన విద్యార్థులు

ప్రత్తిపాడు రూరల్: ప్రతిఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పాండవులపాలెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఓటు హక్కు ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. సీనియర్ సిటిజన్స్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్, డ్రాయింగ్, రంగోళి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. యువ ఓటర్లకు ఓటరు కార్డులను పంపిణీ చేసి, గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, డీటీ కె.పుణ్యవతి, ఎంఆర్ఐ గోపాలకృష్ణ, ఎంఎస్ఓ కె.నాగబాబు, గ్రామ సర్పంచ్ గుమ్మడి రామలక్ష్మి, గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్ఎం ఎస్.బాయ్ తదితరులు పాల్గొన్నారు.



కత్తిపూడిలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



జగ్గంపేటలో ర్యాలీ అనంతరం ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

పీఎం ఆవాస్ యోజన అందించాలని వినతి

గోకవరం: మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రధాన మంత్రి అవాస్ యోజన పథకం అందించాలని బీజేపీ మండలాధ్యక్షుడు ఇనకోటి బాపన్నదొర కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ప్రసాద్‌కు పార్టీ నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని, కానీ పేదలు ఆర్థిక ఇబ్బందులు వలన తమ స్థలాలను విక్రయించారన్నారు. పొజిషన్‌లో ఉన్న వారు వేరు, పట్టాదారులు వేరుగా ఉన్నారన్నారు. ఇప్పుడైనా అర్హులను గుర్తించి నిరుపేదలందరికీ ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వరసాల ప్రసాద్, ముప్పిడి నాగేశ్వరరావు, విశ్వ హిందూ పరిషత్ జిల్లా ప్రముఖ్ ఉంగరాల ఆదివిష్ణు, తదితరులు పాల్గొన్నారు.

రూ.12 వేలు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

కిర్లంపూడి: మండలంలోని సింహాద్రిపురం గ్రామానికి చెందిన గుత్తుల రమేష్ సైబర్ నేరగాడి చేతిలో మోసపోయి బోరున విలపించాడు. వివరాల్లోకి వెళితే...గుర్తు తెలియని వ్యక్తి రమేష్‌కు ఫోన్ చేసి మీకు జియో నుంచి ఆఫర్ కూపన్ వచ్చిందని నమ్మబలికాడు. సదరు మోసగాడు చెప్పిన విధంగా ఫోన్‌ను ఆపరేట్ చేయగానే తన అకౌంట్ నుంచి రూ.12 వేలు మాయమయ్యాయి. తిరిగి సదరు వ్యక్తికి ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో మోసపోయానని గ్రహించిన రమేష్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే 1930 కాల్ చేయమని పోలీసులు చెప్పారు. దీనిపై ఎస్సై జి.సతీష్‌ను వివరణ కోరగా బాధితుడి ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం టోల్ ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.